
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



అనధికార వ్యక్తులను ఆశ్రయించవద్దు: కలెక్టర్

కలెక్టర్: ఆధార్ కార్డులో సవరణలు, వయసు మార్పులు చేస్తామంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టంచేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా ఆధార్‌లో మార్పులు,సవరణలు చేస్తామని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వ్యక్తులు, సంస్థలపై నిఘా పెట్టామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన కేంద్రాలు మినహా మరెక్కడా ఆధార్‌లో మార్పులు- సవరణకు అవకాశం లేదని, ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించి మోసపోవద్దని కోరారు.

కొండవాలు గోర్జి కబ్జా



కొండవాలు గోర్జిలో వేసిన రోడ్డు

- రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కలిపేసుకుని..
- సాగునీటి వనరులకు తీవ్రమైన నష్టం
- ఆర్డీవోకు లేఖ రాసిన ఆ శాఖ అధికారులు

బొబ్బిలి, జూలై 22: బొబ్బిలి సమీపంలో సాగుతున్న రియల్ వ్యాపారంలో దందా సాగుతోంది. అది ప్రభుత్వ భూమి అయితే చాలు కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. గత ఐదేళ్లలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. తాజాగా మరొకటి వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి మండలం దిబ్బగుడ్డివలస పంచాయతీ రాజచెరువువలస గిరిజన గ్రామంలో సుమారు 11 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి కొంతమంది సిరిగంధం మొక్కలు నాటారు. దీనిలో ప్లాట్లు అమ్మేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలో కబ్జా కోణం కూడా వెలుగుచూసింది. వెంచర్ ముందుభాగాన కొండగెడ్డవాలుకు చెందిన గోర్జిని ఆక్రమించేశారు. ఏకంగా గ్రావెల్ రోడ్డు నిర్మించేశారు. అనధికారికంగా పైపు కల్వర్టును కూడా ఏర్పాటు చేశారు. పర్యవసానంగా దిగువ ప్రాంతాల్లోని పంటచెరువులకు సాగునీరందకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

ఆక్రమిత స్థలం సర్వే నెంబరు 69-1,70, 64, 63, 61, 81-82, 75-1లలో ఇరిగేషన్ కోర్సు (ప్రభుత్వ ల్యాండ్) గా పాత బొబ్బిలి రెవెన్యూ రికార్డులో ఉంది. ఈ మార్గంలో రాయి చెరువుతో పాటు ఇతర నీటివనరులకు ఎగువప్రాంతాల నుంచి నీరందుతుంది. రియల్‌ఎస్టేట్ వేయడంతో ఆ నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారనుంది.

రియల్ వ్యాపార ముసుగులో ప్రకృతి వనరులను సొంతం చేసుకునే వ్యూహం జిల్లాలో చాలా సంవత్సరాలుగా సాగుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ పోకడ బాగా విస్తరించింది. విజయనగరం కార్పొరేషన్‌లో పలు చెరువులు మాయమయ్యాయి. అక్కడో చెరువుండేదని చెప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న బొబ్బిలికి కూడా ఈ జాడ్యం పాకింది. చెరువులు, వాగులు, వంకలు కబ్జా చేసి రియల్‌ఎస్టేట్ దందాలు చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు హడావిడి చేయడం.. ఆ తర్వాత వదిలేయడం సర్వసాధారణంగా మారింది. పట్టణం నలుమూలలా ఇలాంటి రియల్‌ఎస్టేట్స్ ఉన్నాయి. సమీప పల్లె ప్రాంతాలకు కూడా పాకింది. అక్కడా యథేచ్ఛగా ఆక్రమణలకు దిగుతున్నారు.



అనధికారికంగా నిర్మించిన కల్వర్టు

అది ఇరిగేషన్ పరిధిలోని గోర్జి

ఎం.తిరుమలరావు, ఇరిగేషన్ డీఈఈ, బొబ్బిలి

ఇరిగేషన్ పరిధిలోని గెడ్డగా బొబ్బిలి రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ మార్గంలో రాయి చెరువుతో పాటు ఇతర నీటివనరులకు ఎగువప్రాంతాల నుంచి నీరందుతుంది. ఇదే విషయాన్ని బొబ్బిలి ఆర్డీవోకు లిఖితపూర్వకంగా తెలియజేశాం. ఇరిగేషన్ వనరులకు సంబంధించి సర్వే అధికారులతో సరిహద్దులు నిర్ణయించి అప్పగించాలని కోరాం.

అది రెండు గ్రామాల రాస్తా

గొర్లె ఈశ్వరరావు, వీఆర్‌వో, పాతబొబ్బిలి

దిబ్బగుడ్డివలస-రాజచెరువువలస గ్రామస్థులు రాస్తా(దారి) కింద ఆ స్థలాన్ని వినియోగించుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు రాసినట్లుగా చెబుతున్న లేఖలేవీ ఆర్డీవో నుంచి మాకు రాలేదు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు భూమి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సర్వేయర్‌తో కలిసి వెళ్లిసరిహద్దులను పక్కాగా నిర్ణయించాం. రోడ్డుతోనే తమకు ఉపయోగమని రాజచెరువువలస గిరిజనులు చెబుతున్నారు.

అన్న క్యాంటీన్లు సిద్ధం చేయండి

- వచ్చేనెల 15న ప్రారంభం
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 22: జిల్లాలోని అన్న క్యాంటీన్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లతో తన చాంబర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ముందుగా మున్సిపాల్టీల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వ్యాధుల వ్యాప్తిపై సమీక్షించారు. మున్సిపాల్టీల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని, సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్లను ఆగస్టు 15న ప్రభుత్వం పునఃప్రారంభించాలని నిర్ణయించిందని, తొలుత విజయనగరంలో రెండు, బొబ్బిలిలో ఒక క్యాంటీన్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. రాజాం, నెల్లిమర్ల అన్న క్యాంటీన్లతోపాటు విజయనగరం ఘోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న క్యాంటీన్‌ను సెప్టెంబరు 21 నాటికి సిద్ధం చేయాలన్నారు. అవకాశం ఉంటే రాజాం అన్న క్యాంటీన్‌ను కూడా ఆగస్టు 15నే ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో అనిత పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ ఎక్కడో!

గిరిజన వర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేస్తారు.. గతంలో టీడీపీ హయాంలోనే భూములు సేకరించిన కొత్తవలస మండలం రెల్లిలోనా లేక వైసీపీ హయాంలో భూములు సేకరించిన మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలోనా అనేది ఇంకా స్పష్టత రాలేదు. ఎస్.కోట నియోజకవర్గంలోనే స్థాపించాలని అక్కడి ఎమ్మెల్యే లలితకుమారి పట్టుబడుతున్నారు. దీనిపై సీఎం చంద్రబాబును కూడా కలిశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, నిర్వాసితులు, ప్రజల్లో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

- గందరగోళంలో ప్రజలు, నిర్వాసితులు
- మెంటాడ మండలంలో గత ఏడాది శంకుస్థాపన
- పరిహారం చెల్లింపులు, పనులు మొదలు
- రెల్లిలోనే అంటున్న ఎస్.కోట ఎమ్మెల్యే
- ముఖ్యమంత్రి ఓకే చెప్పారని వెల్లడి
- అధికారిక సమాచారం లేదన్న యంత్రాంగం

(మెంటాడ)

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద 520 ఎకరాలు కేటాయించారు. భవన నిర్మాణాల్లో భాగంగా మొదటి దశలో ప్రహరీ నిర్మాణం కోసం రూ.5 కోట్లు పైబడి ఖర్చు చేశారు. భవనాల నిర్మాణం మొదలు కానుందని అధికారులు చెబుతున్న దశలో ఎన్నికలు వచ్చేశాయి. 2019లో ప్రభుత్వం మారింది. వెంటనే స్థలం కూడా మారిపోయింది. టీడీపీ ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కాకుండా వేరే ప్రాంతానికి విశ్వ విద్యాలయాన్ని తరలించేందుకు వైసీపీ నిర్ణయించింది. మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలోకి మార్చింది. భూ సేకరణ తంతులో నాలుగేళ్లు నాన్చుతూ వచ్చి ఎన్నికలకు కొద్దినెలల ముందు హడావిడి చేసింది. 2023 ఆగస్టులో అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. భూములు ఇచ్చిన నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు చేసేశారు. పనులు ప్రారంభించాల్సి ఉంది. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి. ఈసారీ ప్రభుత్వం మారింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమ హయాంలో తీసుకొచ్చిన గిరిజన వర్సిటీని తాము మొదట నిర్ణయించిన ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తామంటోంది. ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ కీలక నేతలు ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి కొత్తవలస మండలం రెల్లి వద్దే గిరిజన వర్సిటీ స్థాపించాలని పట్టుబడుతున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లారు.

- శంకుస్థాపన జరిగిన చోటే నిర్మాణం పూర్తిచేసుకుంటుందా, లేక తొలుత భూసేకరణ జరిగిన ప్రాంతానికి తరలుతుందా అన్న ప్రశ్నలు అందరి మదిలో తలెత్తుతున్నాయి. ఈ గందరగోళం మధ్య అధికార యంత్రాంగం ప్రభుత్వ స్పష్టతకోసం ఎదురుచూస్తోంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయంలో తొలి అడుగు పడిన కొత్తవలస మండలం రెల్లి గ్రామం సమీపంలో సుమారు 520 ఎకరాలు సేకరించారు. అప్పట్లో పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం ఇక్కడైతే విశాఖ జిల్లా విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుందని భావించి సంతృప్తి వ్యక్తపరిచింది. దీంతో నాటి టీడీపీ ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని ఖరారు చేసి సేకరించిన భూమి చుట్టూ ప్రహరీని సైతం నిర్మించింది. రైతులకు పరిహారం చెల్లింపు ప్రక్రియ చేపట్టే సమయంలో ప్రభుత్వం మారింది.
- అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీ వ్యవహారాన్ని కొన్నాళ్లపాటు పక్కనపెట్టింది. ఆ తర్వాత పరిహారం పేరుతో కొత్త పల్లవి అందుకుంది. రెల్లిలో సేకరించిన భూమిలో ఎక్కువగా జిరాయితీ ఉందని, పరిహారం ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుందన్న ఎత్తుగడను అమల్లోకి తెచ్చింది. మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉందంటూ వర్సిటీ స్థలం మార్చేసింది. ఈ రెండు మండలాల పరిధిలో 563 ఎకరాలను పరిశీలించింది. ఇందులో జిరా యితీ కేవలం 60 ఎకరాలు మాత్రమే ఉన్నందున పరిహారం ఖర్చు తగ్గుతుందనే సాకు చూపి ఇక్కడే ఖరారు చేసింది. గతేడాది ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి జగన్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి మెంటాడ మండలం కుంతినవలస వద్ద శంకుస్థాపన చేశారు. జిరాయితీ, డిపట్టా , ఆక్రమణ. ఇలా సేకరించిన మూడు రకాల భూములకు నిర్దేశించిన ప్రాప్తికి 90 శాతం మేర పరిహారం చెల్లింపులు జరిగాయి. యూనివర్సిటీ పనులు మెల్లమెల్లగా ప్రారంభమవుతున్నాయి.
- ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కొద్దిరోజులుగా గిరిజన యూనివర్సిటీ కోసం పట్టుబడుతున్నారు. తొలుత ప్రతిపాదించిన రెల్లి గ్రామంవద్దే ఏర్పాటు చేయాలంటున్నారు. సీఎం చంద్రబాబు కూడా తన ప్రతిపాదనకు అంగీకారం తెలిపినట్లు చెబుతున్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా మద్దతు తెలిపారని ప్రకటించారు.
- ఎమ్మెల్యే లలితకుమారి ప్రకటన నిజమే అయితే ఇక్కడ పరిస్థితి ఏమిటనేది అందరిలో తలెత్తుతున్న ప్రశ్న. సేకరించిన 563 ఎకరాలపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందనేదానిపై ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేనందున దీనిపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని అధికార వర్గాలు అంటున్నాయి.



విజయనగరంలో తరగతులు

గిరిజన యూనివర్సిటీ తరగతులు కొద్ది సంవత్సరాలుగా విజయనగరంలోని ఏయూలో తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. 2019-20 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ సోషల్ వర్క్, ఎంబీఏ తదితర కోర్సులతో పాటు డిప్లమో కోర్సులకు సంబంధించి కంప్యూటర్ అప్లికేషన్స్, సైబర్ సెక్యూరిటీ, టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, డిప్లమో ఇన్ హార్టికల్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వ విద్యాలయం నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

గిరిజన వర్సిటీ ప్రతిపాదిత భూములు



ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా మల్లికాగార్గ్

డెంకాడ, జూలై 22: ఐదో ఏపీ స్పెషల్ పోలీస్ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా మల్లికాగార్గ్ బాధ్యతలు స్వీకరించారు. డెంకాడలోని కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆమెకు అసిస్టెంట్ కమాండెంట్ సాముల్‌జోహన్ స్వాగతం పలికారు. ఈమె ఇప్పటివరకు పల్నాడు ఎస్పీగా పనిచేశారు. బదిలీలో భాగంగా స్పెషల్ బెటాలియన్‌కు వచ్చారు.

గ్రామాన్ని తరలించి క్వారీ నిర్వహించుకోండి

- లేకుంటే పనులు అడ్డుకుంటాం
- అధికారులకు రామచంద్రపేట గ్రామస్థుల హెచ్చరిక



అధికారులను ప్రశ్నిస్తున్న రామచంద్రపేట గ్రామస్థులు

భోగాపురం, జూలై 22: తాతముత్తాతల నుంచి నివాసముంటున్న గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించాకే క్వారీ నిర్వహించుకోవాలని, లేదంటే ప్రాణాలకు తెగించి క్వారీ పనులను అడ్డుకొంటామని రామచంద్రపేట గ్రామస్థులు అధికారుల ముందు మొర పెట్టుకొన్నారు. గ్రామ సమీపంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులకు సంబంధించి జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్అండ్‌టీ వారు నిర్వహించనున్న క్వారీ స్థలాన్ని ఆర్‌డివో సూర్యకళ, మైన్స్‌అండ్ జియాలజీ అధికారి సీహెచ్ సూర్యచంద్రరావు, జీఎంఆర్ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. విషయం తెలుసుకొన్న స్థానికులు అక్కడకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ నిర్వహిస్తే అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, గ్రామమంతా దూలితో నిండిపోతుందని, బాంబుల కారణంగా భూమి కంపించి గృహాలు పోతాయన్నారు. గతంలో క్వారీ వల్ల రాళ్లు వచ్చి పడడంతో ఓ స్థానిక మహిళకు కాలు విరిగిపోయిందని గుర్తు చేశారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని పిల్లలు భోజనం చేసే సమయంలో దూళి చేరుతుందని అన్నారు. పాతక్వారీల కారణంగానే అనేక ఇబ్బందులు పడుతున్నా మని, మళ్లీ కొత్తక్వారీలు ఏర్పాటు చేస్తే గ్రామం విడిచి వెళ్లిపోవడమే తప్ప వేరే గత్యంతరం లేదన్నారు. అనంతరం అధికారులు హైస్కూల్‌కు చేరుకొని అక్కడి ఉపాధ్యాయు లతో మాట్లాడి పరిస్థితి గురించి అడిగి తెలుసుకొన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానికులతోనూ మాట్లాడారు.

ఎట్టి పరిస్థితుల్లోను కొత్తగా క్వారీ నిర్వహించకూడదని, అయినా అనుమతి ఇస్తే ముందు గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరారు. ఆర్డీవో సూర్యకళ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏవిధంగా క్వారీ నిర్వహిస్తారా రాతపూర్వకంగా తెలియజేయాలని ఎల్అండ్‌టీ వారికి సూచించి అనంతరం అక్కడ నుంచి వెనుతిరిగారు. బృందం వెంట తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ కూడా ఉన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

నిఘా ఏర్పాటు చేస్తాం: ఎస్పీ వకుల్‌జిందాల్



బూర్జవలస స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్నఎస్పీ

గజపతినగరం/ బొండపల్లి/ దత్తిరాజేరు, జూలై 22: జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. గజపతినగరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. రికార్డుల పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గంజాయి రవాణా అరికట్టేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, మత్తు పదార్థాలకు బానిసలై యువత భవిష్యత్ నాశనం కాకుండా కళాశాలల్లో విద్యార్థులకు పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని, ఆన్‌లైన్ మోసాలు జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాస్, సిఐ ఎన్‌వీ ప్రభాకరావు, ఎస్ఐ యు.మహేష్ ఉన్నారు.

- బొండపల్లి పోలీసుస్టేషన్ ప్రాంగణం, క్వార్టర్స్ పరిసరాలను కూడా ఎస్పీ వకుల్‌జిందాల్ సోమవారం పరిశీలించారు. ఇక్కడ నమోదవుతున్న కేసులపై ఆరా తీశారు. రిసెప్షన్ రికార్డులను పరిశీలించి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి ఎక్కువగా ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను ఆయన మ్యాపులో పరిశీలించారు. విధిగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ప్రజలకు రక్షణ చట్టాల పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి సీఐ కేకేవీ.విజయనాథ్, బొండపల్లి ఎస్ఐ లక్ష్మణరావు ఉన్నారు.
- ఎస్పీ వకుల్‌జిందాల్ సోమవారం దత్తిరాజేరు మండలం పెదమానాపురం, బూర్జవలస పోలీసు స్టేషన్‌లను కూడా సందర్శించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ ఉన్నారు.

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి

ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.



రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విధానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే.. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని ఆర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా వన్ ప్లస్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		



వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరిగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్‌ఎస్‌ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్థమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండ కూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి

వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాధలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదు సంవత్సరాల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లున్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

అమ్మకాల వెల్లువ

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్ మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది.



ఆహార ధరలపై వాతావరణ ప్రభావం

గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడిగాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.

ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ఎంఎస్‌ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్‌ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

వివిధ సమస్యలపై 149 వినతులు

● కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ● గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్, జూలై 22: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 149 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ కార్తీక్, డీఆర్వో అనిత స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 75 వినతులు, డీఆర్‌డీఏ 14, డీపీవో 10, వైద్యశాఖకు 6, మున్సిపల్ శాఖకు 11 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రోజు వినతులు ఆరోజే చూడాలని చెప్పారు. అలా వచ్చిన వాటిని గడువులోగా పరిష్కరించాలని, రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పంపాలని, ఆన్‌లైన్‌లో పెండింగ్ కనపడకూడదని ఆదేశించారు.

ఆర్ఐవోను సస్పెండ్ చేయాలి

జిల్లాలోని కార్పొరేట్ కళాశాలలకు కొమ్ము కాస్తున్న ఆర్ఐవోను తక్షణమే విధుల నుంచి తప్పించాలంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మొదటి నుంచి ఆర్ఐవో ఎన్నో అక్రమాలకు వంత పాడుతూ వస్తున్నారని వివరించారు. చీపురుపల్లిలోని ఆదిత్య జూనియర్ కళాశాలలకు అనుమతి లేకపోయినా, అడ్మిషన్లు చేస్తున్నా చర్యలు తీసుకోలేదని వివరించారు. ఈ సంవత్సరం కళాశాల అనుమతి రద్దు కావడంతో 206 మంది విద్యార్థుల భవితవ్యం అయోమయంగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బొబ్బిలి శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం అడ్మిషన్లు చేస్తూ తరగతులు నిర్వహిస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఎస్.కోట విజ్ఞానభారతి హాస్టల్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్, వెంకీ, రమేష్ పేర్కొన్నారు.

నిబంధలనకు విరుద్ధంగా ఇళ్ల స్థలాలు

విజయనగరం మండలం కొండకరాం గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీకి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో వేణుగోపాలపురం బిట్-1 సర్వే నెంబరు 2లో కొంతభూమిని చదును చేసి హద్దులు ఏర్పాటు చేసి 40 మందికి ఇంటి పట్టాలను 2019 ఏప్రిల్ 25న ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ నాయకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐవీపీ రాజు, బొద్దల నర్సింగరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెయిటేజీ మార్కులు ఇవ్వాలి

'మేము నేషనల్ హెల్త్ మిషన్‌లో ఐదేళ్లుగా పని చేస్తున్నాం. అప్పట్లో జిలా సెలక్షన్ కమిటీ ద్వారా ఉద్యోగాలు పొందాం. కొవిడ్ సమయంలో మా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశాం. స్థానిక మెడికల్ కాలేజీలో 200 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో 120 పోస్టులు భర్తీ చేయగా, ఇంకా 86 మిగిలి ఉన్నాయి. మాకు కొవిడ్ వెయిటేజ్ మార్కులు ఇచ్చి 86 పోస్టులలో అవకాశం కల్పించాల'ని నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న స్టాఫ్‌నర్సులు కోరారు.

విద్యార్థుల తరలింపుతో ఇబ్బంది

'జిల్లాలోని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలకు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను తీసుకుని వెళ్లడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. నిరసన కార్యక్రమాలు నిర్వహించే సమయంలో విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే మేమే బాధ్యత వహించాల్సి వస్తోంది. తల్లిదండ్రులకు మేమే సమాధానం చెప్పుకోవలసి వస్తోంద'ని పట్టణంలోని వివిధ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



వినతుల స్వీకరిస్తున్న కలెక్టరు అంబేడ్కర్

మళ్లీ భారీ వర్షాలు

మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు: కలెక్టర్

విజయనగరం(ఆంధ్రజ్యోతి), జూలై 22: ఈ నెల 23 నుంచి మూడురోజుల పాటు జిల్లాలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పినట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాలు, చెట్లు కింద, విద్యుత్ సంభాలవద్ద ఉండకూదన్నారు. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయద్దన్నారు. జిల్లాలోని 27 తహసీల్దార్ కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించామని, అన్ని చోట్లా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు అన్నదానం

విజయనగరం రూరల్, జూలై 22: ప్రపంచ ధర్మంకోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన హజరత్ ఇమామ్ హుసేన్, హుసాన్‌ల పేరున స్థానిక కోట్ల మాదప్పవీధిలో ఉన్న మసీదు వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నగర శాఖ ముస్లిం ప్రతినిధి మహ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు న్యాయత్ షావలీ బాబా ఉరుసు

విజయనగరం రూరల్: నగరంలోని ఉల్లివీధిలో ఉన్న హజరత్ సయ్యద్ న్యాయత్ షావలీబాబా 52వ చందనోత్సవం బుధవారం జరుగుతుందని నగర శాఖ ముస్లిం ప్రతినిధి మహ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆర్‌టీఐ అమలుపై తనిఖీ చేపట్టాలి

శృంగవరపుకోట రూరల్, జూలై 22: జిల్లాలో ఆర్‌టీఐ అమలుపై కలెక్టర్ అంబేడ్కర్ ఆకస్మిక తనిఖీ చేసి దీనిని సమర్థంగా అమలు చేసేలా చూడాలని కోరారు. సోమవారం ఆర్‌టీఐ కార్యకర్త శీరాపు శ్రీనివాసరావు ధర్మవరం గ్రామంలో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంచేలా చూడాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

కలెక్టరేట్: వలంటీరు వ్యవస్థను కొనసాగించాలంటూ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన రావు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వేతనం రూ. 10 వేలు అందజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు రాజీనామ చేయని వలంటీర్లను కొనసాగిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో పని చేశారని, వారు అతి తక్కువ జీతంతో పని చేశారని వారిని తిరిగి విధుల్లో తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ దిద్దుబాట్లు

రామభద్రపురం, జూలై 22: మండల కేంద్రంలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ కార్డుల దిద్దు బాట్ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా పుట్టినతేదీకి సంబంధించి వీఆర్వో నుంచి ధ్రువపత్రం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మూడు కేంద్రాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. భూమి రీసర్వేలో సబ్ డివిజన్ సర్వర్ ఆగిపోవడంతో ఈ సర్టిఫికెట్లు తేవడం లేదని తెలిపారు. 590 మంది కౌలు రైతులకు కార్డులు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. హెచ్‌డీటీ సుబ్బారావు కూడా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనారాణి

29న చలో కలెక్టరేట్

గరుగుబిల్లి: మన్యం జిల్లా పరిధిలోని 15 మండలాల్లోని పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, దీంతో ఈనెల 29న భూసమస్యలు పరిష్కరించాలని చలో కలెక్టరేట్ నిర్వహించనున్నామని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడులు జరిగి నెల లు గడుస్తున్నా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

ఉమా జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలి

కలెక్టరేట్: కొత్తవలస ఉమా జ్యూట్ మిల్లు అక్రమ లాకౌట్‌ను ఎత్తి వేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ మిల్లులో సుమారు 400 మంది కార్మికులు 30 సంవత్సరాలుగా పని చేస్తున్నారని తెలిపారు. వీరికి గత ఏడాది నుంచి జీతం ఇవ్వడం లేదని, కార్మికుల నుంచి వసూలు చేసిన పీఎఫ్, ఈఎస్ఐ ప్రభుత్వం వద్ద జమ చేయకపోవడంతో రిటైర్డ్, చనిపోయిన ఉద్యోగులకు చట్ట ప్రకారం రావాల్సిన డబ్బులు అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరారు.

కొట్టాం, విజినిగిరి మీదుగా బస్సులు నడపాలి

జామి: ఎస్.కోట, విజయనగరం ఆర్టీసీ డిపోల నుంచి కొట్టాం.. విజినిగిరి మీదుగా విజయనగరం, విశాఖపట్నంకు బస్సు సర్వీసులు నడపాలని మాజీ జడ్‌పీటీసీ బండారు పెదబాబు ఆర్టీసీ ఆర్ఎంకు విజయనగరంలో వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ఈ విషయమై పెద బాబు మాట్లాడుతూ ఉదయం 7.30 నుంచి రాత్రి 9-15 గంటలకు ఆఖరి బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌ఈపీతో పాఠశాల విద్య అస్తవ్యస్తం

బొబ్బిలి: నూతన విద్యావిధానం వల్ల రాష్ట్రంలో పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో నూతన విద్యా విధానం-పాఠశాల విద్యపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా సొంత విద్యావిధానాన్ని వివిధ రాష్ట్రాలు అమలు చేసుకుంటున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ఎన్‌ఈపీని అమలు చేసిందన్నారు. ఏపీటీఎఫ్ నేతలు బొత్స పద్మావతి, బంకురు జోగినాయుడు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 29 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, జూలై 22: జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులకు పాల్పడే వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 29 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి.

● డెంకాడ మండలం చింతలవలసకు చెందిన మహిళ ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేస్తూ తన ఇంటి స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ● విజయనగరం పట్టణానికి చెందిన మహిళ తన ఇంటి స్థలాన్ని అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న బంధువులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని.. బెదిరింపులకు పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ● బొబ్బిలి పట్టణం గొల్లపల్లికి చెందిన ఒక వ్యక్తి తన దగ్గర బంధువులు ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులపై సంతకాలు చేసుకుని మోసగించి.. 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల 50 వేల నగదు కాజేశారని, న్యాయం చేయాలని కోరారు. వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వకుల్ జిందాల్, వాటిని తక్షణమే పరిష్కరించి, తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వీరకుమార్, గోవిందరావు, సీఐలు మురళి, విజయానాథ్, నర్సింహమూర్తి, ఎస్ఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

శృంగవరపుకోట, జూలై 22: సచివాలయ ఆవరణలో సోమవారం సీఎం నారా చంద్రబాబు నాయుడును శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని. పార్టీకోసం కష్టపడిన నియోజకవర్గ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఆమెతో పాటు కొత్తవలస మండలం చింతపాలెం సర్పంచ్ మాకెన నవీన్ పాత్రుడు ఉన్నారు. ● **బొబ్బిలి, జూలై 22:** బొబ్బిలి మండలం పారాదిలో వేగావతి నదిపై కొత్త వంతెన మంజూరైందని, దీని కోసం వెంటనే నిధులు విడుదల చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన సందర్భంగా అమరావతి సెక్రెటేరియట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలుసుకొని వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. బొబ్బిలి-తెర్లాం రోడ్డు, బాడంగి మండలం పినపెంకి-ఆకులకట్ట రోడ్ల మరమ్మతులకు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరానన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని బేబీనాయన తెలిపారు.



సీఎంకు వినతినిస్తున్న బేబీనాయన, సీఎంతో లలితకుమారి

ఆ కుటుంబాలను రోడ్డున పడేశారు



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, జూలై 22: మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న జనరల్ డ్యూటీ అటెండర్, ఆఫీస్ సబార్డినేట్‌లకు సంబంధించిన 40 కుటుంబాలను నిర్లక్ష్యంతో రోడ్డున పడేశారని, ఏడాది కాలంగా వెట్టి చాకిరి చేయిస్తున్నారని, ఎందుకు జీతాలు ఇవ్వలేదో అధికారులు తెలియజేయాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆసుపత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడును ప్రశ్నించారు. సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ 2023 జూలై నుంచి 43 మంది నిర్విరామంగా జిల్లా కేంద్రాసుపత్రిలో విధులు నిర్వహిస్తుంటే, వారికి జీతాలు సమయానికి అందించాలన్న ఆలోచన అధికారులకు లేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. తక్షణమే వారికి జీతాలు ఇచ్చేందుకు ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో రామచంద్రరాజు, రొంగలి పోతన్న, గోపాలరావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య సమస్య లేకుండా చూడండి

విజయనగరం రూరల్, జూలై 22: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు విస్తృతం చేయాలని ఎంపీడీవో గంటా వెంకటరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగు అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాలువల్లో పూడిక తీత తక్షణమే తీయించాలన్నారు. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరావు

ఐటీడీఏ పీవోకు వీడ్కోలు



శుభం బన్సాల్‌కు వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పీవో శుభం బన్సాల్ తిరుపతి జేసీగా బదిలీపై వెళ్లడం తో ఆయన సోమవారం ఐటీడీఏ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎన్ని కల సమయంలో మీ అందరి సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పీవో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఏపీవో గణేష్, ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, ఏవో విజయరాణి, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఉపాధి ఏపాడీ శ్రీ హరి, ఏఎంవో కోటి బాబు, సతీష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాచిపెంట వైద్యాధికారిపై విచారణ



పాచిపెంట వైద్యాధికారి వెంకటరమణను విచారిస్తున్న ఆర్డీవో హేమలత

పాచిపెంట: పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వెంకటరమణపై సోమవారం పార్వతీపురం ఆర్డీవో కె.హేమలత విచారణ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆశావర్కర్లు, సీహెచ్ డబ్ల్యూలను నియమించారని పాచిపెంట సర్పంచ్ పి.సంతోషి వైద్యాధికారి వెంకటరమణపై ఇటీవల కలెక్టర్ గ్రీవెన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే ఈనెల 19న పాచిపెంటలో మండల సమావేశంలో కూడా ఇదే అంశంపై లేవదీస్తూ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి కూడా తెలియజేశారు. దీంతో సంధ్యారాణి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో హేమలత తహసీల్దార్ కార్యాలయంలో వైద్యాధికారిని, కొంతమంది ఆశావర్కర్లను, సీహెచ్‌డబ్ల్యూలను విచారించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆర్డీవో హేమలత తెలిపారు.

కోల్ట్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి

● జనసేన పాలకొండ నియోజకవర్గ నాయకులు

పాలకొండ: సీతంపేటలో కోల్ట్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని, గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, భామిని మండలంలో రోడ్డు సమస్యలను పరిష్కరించాలని జనసేన పాలకొండ నియోజకవర్గ నాయకులు జానీ, పొట్నూరు రమేష్, జామి అనీల్, బొత్స ఖుషినాయుడు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పీఏసీ సభ్యులు కొణిదెల నాగేంద్రబాబును సోమవారం కలిశారు. వంశధార కాలువ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పాలకొండలో డంపింగ్‌యార్డు, ఐటీఐ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరఘట్టంలో డిగ్రీ, జూనియర్ కాలేజ్‌లకు వేర్వేరుగా భవనాలు నిర్మించాలని కోరారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాగబాబు తెలిపారు.



నాగబాబును కలిసిన జనసేన నాయకులు

'శాంతిభద్రతలపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు'

బొబ్బిలి: శాంతిభద్రతలపై మాట్లాడే హక్కు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి గానీ, వైసీపీ నాయకులకు గానీ లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పువ్వల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2019 మే 30 నుంచి 2024 జూన్ 11 వరకు జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో జరిగిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ఈ అరాచకాలపై జగన్ పెదవి విప్పి ఉంటే జనం హర్షించే వారన్నారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజానీకమంతా నిశ్చింతగా ఉన్నారని తెలిపారు. జగన్ అనవసరంగా టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఆడిపోసుకుంటే జనం తిరగబడడం ఖాయమని అన్నారు.

వంశధారలో పెరిగిన నీటి ప్రవాహం

● నిలిచిపోయిన పడవ ప్రయాణం

భామిని: వంశధార నది క్యాచ్‌మెంట్‌ఏరియాలో కురుస్తున్న వర్షాలకు నదిలో ప్రవాహం పెరగడంతో నేరడి వద్ద పడవ ప్రయాణాన్ని అధికారులు నిలిపివేశారు. ఒడిశాలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వంశధారలో క్రమేణా ప్రవాహం పెరుగుతోంది.ఈ నేపథ్యం మన్యం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాసరావు ఇప్పటికే నదీతీర ప్రాంతాలను సందర్శించి అప్రమత్తం చేశారు. అలాగే నేరడిలోని పడవ ప్రయాణం నిలిపివేయాలని నిర్వాహకులకు స్పష్టంచేశారు. పడవ ప్రయాణం నిలిచిపోవడంతో భామిని మండలంలోని గురండి, కాట్రగడ, లివిరి, బాలేరు తదితర గ్రామాల ప్రజలు ఒడిశాలోని గజపతి జిల్లా రాకపోకలకు 30 కిలోమీటర్లు అధనంగా ప్రయాణించాల్సిఉంటుంది. ఈ పడవ ఆధారంగా వర్షాకాలంలో 200 మంది వరకు ఇరువైపులా రాకపోలు సాగిస్తుంటారు. నదిలో నీటిమట్టం పెరగడంతో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కోరారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార, పక్కనే నిలిచిన పడవ

సీఆర్టీలను రెన్యువల్ చేయాలి



కలెక్టరేట్ వద్ద సోమవారం రాత్రి ధర్నా చేస్తున్న సీఆర్టీలు

పార్వతీపురంటౌన్: తమ పోస్టులను రెన్యువల్ చేయాలని కోరుతూ పట్టణంలోని సీఆర్టీలు సోమవారం రాత్రి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఐటీడీఏ అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ధర్నా చేస్తున్నామని యూటీఎఫ్ నాయకులు మురళీమోహన్, రమేష్ తదితరులు తెలిపారు.

లారీ, బస్సు ఢీ.. ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

కొమరాడ: మండలంలో గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం నుంచి కూనేరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును రాయగడ నుంచి విశాఖ పట్నం వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆర్టీసీ బస్సులో ఉన్న గరుగుబిల్లి మండలం రావివలసకు చెందిన మరిశర్ల అప్పలనాయుడు తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. మరిశర్ల సంజీవ్‌కుమార్ కుడి చేయికి గాయమైంది. వీరిద్దరూ చోళ్లపదంలో బంధువుల ఇంటికి వెళ్లడానికి పార్వతీపురం ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణిస్తున్నారు. ఒడిశాకు చెందిన శరత్‌కు కూడా గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే పార్వతీపురంలోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన వృద్ధురాలు చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది.కుటుంబ సభ్యులు, ఎస్ఐ ఫక్రుద్దీన్ కథనం మేరకు.. చలివేంద్రికి చెందిన కోడూరు వరహాలమ్మ(74) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని ఇంటికి చేరింది. అయినా వ్యాధి నయంకాకపోవడంతో మనస్తాపానికి గురై శని వారం వేకువజామున పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం తొలుత పాలకొండ, ఆ తర్వాత శ్రీకాకుళం తరలించారు. ఈమేరకు పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలో చికిత్సపొందుతూ మృతిచెందింది. వరహాలమ్మకు భర్త పోలినాయుడు, కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎస్ఐ ఫక్రుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ఎస్.కోట క్రీడాకారుల ప్రతిభ

శృంగవరపుకోట: శృంగవరపుకోట స్పోర్ట్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన పోటీల్లో అండర్ 11బాలుర సింగిల్‌లో జి.హర్ష (ప్రథమ), డబుల్స్‌లో యశోవర్ధన్, చార్విక్ (ప్రథమ), అండర్ 15 బాలికల సింగిల్స్‌లో ఎస్.లాస్య, (ద్వితీయ), అండర్-17 బాలుర సింగిల్‌లో ఎం.రోహిత్ (ప్రథమ) స్థానాలు సాధించినట్లు కోచ్ మళ్లా ప్రసాద్, అసిస్టెంట్ కోచ్ ఆర్.మోహన్ తెలిపారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.



జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

సత్యసాయి ఆలయంలో పూజలు

జామి, జూలై 22 : మండల కేంద్రంలో ఉన్న భగవాన్ సత్యసాయి ఆలయంలో సోమవారం భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి సభ్యులు మాట్లాడుతూ గురుపూజోత్సవాల్లో బాగంగా ఈ కార్యక్రమం చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జామి సత్యసాయి ఆలయంలో పూజలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొమరాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ కోరారు. సోమవారం కొమరాడ వద్ద నాగావళి నది తీర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నదుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో సమీప ప్రాంత ప్రజలు నదీ తీర ప్రాంతానికి రావొద్దని సూచించారు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ వల్ల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగినా తక్షణమే సచివాలయంలో ఉన్న సిబ్బందికి గాని, తహసీల్దార్ కార్యాలయంలో గాని ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాసరావు ఉన్నారు.



నాగావళి నదీ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

శిథిల భవనాల్లో బిక్కు బిక్కు మంటూ..

● అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాలు
● పెచ్చులూడుతున్న శ్లాబులు
● వర్షాకాలంలో ఆవరణలోకి చేరుతున్న నీరు
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా మారుతున్నాయి. శ్లాబుల నుంచి నీరు కారడంతో పాటు పెచ్చులు ఊడిపడుతున్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

వానాకాలంలో తప్పని అవస్థలు

గజపతినగరం: ఎన్నో ఏళ్ల కిందట నిర్మాణాలు చేపట్టిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే భవనాలు కారిపోయి రికార్డులు తడిచిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఏళ్ల తరబడి కట్టిన భవనాలు పెచ్చులు ఊడిపోయి గోడలు పగలిపోవడంతో చినుకురాలితే చాలు వర్షపునీరు కార్యాలయంలోకి వస్తోంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పలు కార్యాలయాలు జలమయమైపోతున్నాయి. కొన్ని సమయాల్లో పాములు కూడా కార్యాలయాల్లో హల్‌చల్ చేయడంతో భయాందోళనతో విధులు నిర్వహించాల్సి వస్తుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పడలేక అద్దె భవనాలు తీసుకుందామన్నా వేల రూపాయలు అద్దె చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. మండలంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో, ఆంధ్ర ఇరిగేషన్ కార్యాలయం, మండల వనరుల కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం ప్రభుత్వ భవనాలు పాత భవనాలు కావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని ఆయా శాఖ అధికారులు అంటున్నారు. ప్రతిఏడాది తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకపోతుందని అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ పాత భవనాలపై దృష్టి సారించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు పాత భవనాలపై దృష్టి సారించి కొత్త భవనాలు మంజూరు జరిగేలా చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.



వర్షపు నీటిలో ఆంధ్ర ఇరిగేషన్ కార్యాలయం



ఇదీ గుర్ల ఎంపీడీవో కార్యాలయం దుస్థితి

ఏ క్షణం కూలిపోతుందో..

గుర్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణ భవనం కూలిపోతుందోనని అధికారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయంలోని గదుల్లోకి వెళ్లాలంటే అధికారులు హడలెత్తిపోతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. కుర్చీలో కూర్చుంటే ఏ క్షణం శ్లాబు తమపై పడి ప్రాణాలు పోతాయోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నూతన భవనం కోసం కోట్ల రూపాయలు నిధులు మంజూరైనప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ఆ భవనంలో అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ ఉండడానికి నివాసయోగ్యంగా కాదని చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్షం వస్తే చాలు కార్యాలయంలోకి నీరు చేరుతోంది. శ్లాబు నుంచి కూడా నీరు కారి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, ఈ భవన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.



గుర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేరిన నీరు

సమస్యలుంటే గ్రీవెన్స్‌కు తీసుకురావాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అధికారులు

భోగాపురం: మండలంలో ఎమైనా సమస్యలుంటే కలెక్టరేట్‌కు కాకుండా మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తీసుకురావాలని ఎంపీడీవో జి.చంద్రకళ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టరేట్ ద్వారా నిర్వహిస్తున్న వెబ్ కాన్ఫరెన్స్ తిలకిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కలెక్టరేట్‌కు తీసుకెళ్లకుండా ముందుగా మండల పరిషత్‌కు అందజేయాలని సూచించారు. పరిష్కరించడంతో ఆలస్యమైనా, సంతృప్తి లేకపోయినా కలెక్టరేట్‌కు వెళ్లవచ్చని చెప్పారు. అయితే ముందుగా ఏ సమస్య ఉన్నా దరఖాస్తులు మండల పరిషత్‌కు అందజేయాలన్నారు. దీనిపై గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఫిర్యాదులు కరువు



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీరో ఫిర్యాదుల వచ్చినట్టు ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు. గత వారం ఒక ఫిర్యాదు రాకపోగా, తాజాగా నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఒక్క ఫిర్యాదు రాకపోవటం విశేషం. గ్రామాల్లో సమస్యలు లేవా.. ప్రజల్లో అవగాహన కరువయ్యిందా అనేది చర్చకు దారి తీస్తోంది. పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు నిర్దేశిత సమయానికి హాజరవుతున్నారని ఎంపీడీవో తెలిపారు.

నెల్లిమర్లలో ఎస్‌ఎఫ్‌ఐ నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నెల్లిమర్ల: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం రామతీర్థం జంక్షన్ వద్ద రాస్తారోకో, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.జగదీష్ మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు రక్షణ లేకుండాపోతున్నదని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ సమీరా, జిల్లా కమిటీ సభ్యులు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోండి

రేగిడి: మండలంలో ఎంపికచేసిన సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారి ప్రజలకు సూచించారు. ఈ షెడ్యూల్‌ను సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ వర్గాలు విలేకర్లకు అందించారు. ఈనెల 23, 24వ తేదీల్లో కోడిశ, దేవుదళ, పారంపేటలోను, 25, 26వ తేదీల్లో సరసనాపల్లి, ఉంగరాడ, అంబాడలోనూ, 27న తునివాడ, లక్ష్మీపురం, ఒప్పంగి గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు చెప్పారు. ఈ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



కాత్యాయినిని అభినందిస్తున్న దృశ్యం

శృంగవరపు కోట రూరల్: ధర్మవరం ఉన్నత పాఠశాలకు చెందిన అల్లాడ కాత్యాయిని రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు పొట్నూరు శ్రీరాములు, రెడ్డి కృష్ణ తెలిపారు. సోమవారం వీరు మాట్లాడుతూ ఈనెల 20న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కాత్యాయిని ప్రతిభ చూపించి... రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఆ విద్యార్థినిని హెచ్ఎం ఉమమహేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

బీమా పరిష్కారాలు వేగవంతం

రామభద్రపురం: భారతీయ స్టేట్ బ్యాంకు ఖాతాదారుల బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని స్థానిక బ్రాంచి మేనేజర్ హరీంద్ర తెలిపారు. ఇటీవల మృతిచెందిన చొక్కాపు మురళి వారసులు జయమ్మకు సోమవారం బ్రాంచి ఆవరణలో రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా జీవనజ్యోతి, సురక్ష బీమా యోజనలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు



తహసీల్దార్‌తో సమీక్షిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

రేగిడి: నదీ తీరం, గెడ్డల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా మని, గుర్తింపు ఉన్న రీచ్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఇసుక నియంత్రణ టాస్క్‌ఫోర్స్ విభాగం సీఐ ఎస్.రాజేశ్వరీ తెలిపా రు. మండలంలోని నాగావళి నదీ తీరంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా విషయం టాస్క్‌ఫోర్స్ విభాగం దృష్టికి వెళ్లింది. ఈమేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం వెంకటాపురం రీచ్‌ను తనిఖీ చేసింది. ముందుగా వీరు స్థానిక తహసీ ల్దార్ జె.రాములమ్మతో సమావేశమై.. గుర్తింపు ఉన్న ఇసుక రీచ్‌లు, అక్రమ రవాణాపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రీచ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, నిఘా ఉంచాలని, ఎక్కడ అక్రమ ఇసుక వాహనాలు దొరికినా సీజ్ చేసి, కేసులు నమోదు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. అక్రమ రవాణా సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సంతకవిటి మండలం తమరాం, మేడమర్తి ఇసుక రీచ్‌లను పరిశీలించి, అక్కడ సీసీ కెమెరాలతో నిఘా పటిష్టం చేసినట్టు సీఐ తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

చీపురుపల్లి: ఓ అనాథ మృతదేహానికి కొందరు మనవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో గత కొంత కాలంగా ఓ గుర్తు తెలియని వృద్ధురాలు నివసిస్తూ ఉండేది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురి కావడంతో స్థానికులు చికిత్స అందజేశారు. ఈక్రమంలో ఆమె సోమవారం అమ్మవారి ఆలయం వద్దనున్న బస్‌స్టాప్‌లో తుది శ్వాస విడిచింది. సమాచారం తెలుసుకున్న ఆశయ, మానవీయత సంస్థల ప్రతినిధులు రెడ్డి రమణ, టీవీ గోవిందరాజులు, వైసీపీ నాయకుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు ఆమె మృతదేహాన్ని సమీపంలో ఉన్న శ్మశానవాటికకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. కోట్ల పైడిరాజు, తాడ్డి సీతారత్నం, గవిడి కనకేశ్వరి, బత్తుల నారాయణరావు సహకారాన్ని అందజేశారు.

కలుపు యాజమాన్య పద్ధతి పాటించాలి



మధుపాడలో వరి ఎదలను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం: ఎద పద్ధతిలో వరి సాగుచేసిన రైతులు తప్పనిసరిగా కలుపు యాజమాన్య పద్ధతిని పాటించాలని ఏడీఏ కేపీ మహరాజన్ సూచించారు. మధుపాడ గ్రామంలో ఎదపద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో కలుపు నివారణకు నారు ఊడిచిన 3 నుంచి 5 రోజుల్లో ఎకరానికి 100గ్రాముల పైరి జోసల్ఫ్యురాన్ ఇథైల్ అనే మందును 200 కేజీల ఇసుకలో కలుపుకొని పలచని నీటిలో పొలమంతా సమానంగా జల్లుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ధనలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం, మరడాం గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు లక్ష్మణరావు, ఎంఎంవీ.శ్రీనివాస్‌లతోపాటు ఏడీఏ మహరాజన్ సోమవారం పర్యటించారు. వరి, పత్తి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. ఎకరా పత్తి పొలానికి 25 కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ ఈ పదునులో వేసుకోవాలన్నారు. పత్తిలో ప్రస్తుతం ఉన్న కలుపు నివారణకు ఒక ఎకరానికి పైరుథయా బ్యాక్ సోడియం 250ఎంఎల్, క్విజాల్లో పాస్ ఇథైల్ 400 ఎంఎల్‌లను కలిపి 200 లీటర్ల నీటిలో పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి నారుమడిలో 5 సెంట్ల నారు మడి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని, 2 కేజీల యూరియా, 3 కేజీల డీఏపీ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నీలాకృష్ణ, వీఏఏ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: స్థానికంగా చేపడుతున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన గెంబలి వాసుదేవరావు దంపతులు రూ.లక్షా116 విరాళంగా ఇచ్చారు. ఆలయ ట్రస్టు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తిలకు సోమవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్ల స్వామి, దిలీప్‌కుమార్, ధనూకా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు



మంత్రి నాదెండ్లతో జనసేన నాయకులు

చీపురుపల్లి: జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, నాయకు డు చందక బాలకృష్ణ తదితరులు సోమవారం తెనాలిలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిశారు. ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ కార్యకర్తలు జనసేన శంకర్, దీపక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

భోగాపురం: మండలంలోని భోగాపురం, ముక్కాం విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈ ఎస్‌కే మస్తాన్‌వల్లి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 33కెవీ విద్యుత్తు లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్తు నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం: కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం వి.వసంతరావు ఆధ్వర్యంలో కుటమి నాయకులు ప్రభుత్వం సరఫరా చేసే విద్యా కిట్లను సోమవారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మీసాల సత్యంనాయుడు, సామంతుల లక్ష్మణరావు, సామంతుల రమణనాయుడు, టంకాల వైకుంఠరావు, రేయ్యి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

గరుగుబిల్లి: పీహెచ్‌సీలకు వైద్య సహాయం నిమి త్తం వచ్చే వారికి మెరు గైనవైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఉరిటిరామారావు కోరారు. సోమవారం గరుగుబిల్లి పీహెచ్‌సీలో గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.సమావేశంలో వైద్యులు కె.కార్తీక్, ఎస్. సంతోష్‌కుమార్, సర్పంచ్ కె.ఇందుమతి, జి.శ్రీనివాసునాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టీఎల్ఎంతో బోధించాలి

● పాఠశాలల్లో ప్రారంభమైన శిక్షా సప్తాహ్



భోగాపురం: ముక్కాంలో టీఎల్ఎంలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రేగిడి: పాఠశాలల్లో విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) ద్వారా బోధించాలని ఎంఈవో వరప్రసాదరావు సూచించారు. లచ్చరాయపురం ఎంపీపీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. టీఎల్ఎంలు, వర్కుబుక్‌లు, టీచర్ల డైరీల నిర్వహణ, లెసన్ ప్లాన్లపై ఆయన ఆరా తీశారు. ● **లక్కవరపుకోట:** జాతీయ విద్యా విధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో జూన్ 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంఈవో కూర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కస్తూర్బా గాంధీ పాఠశాలలో బోధనా అభ్యసనా సామగ్రి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలని పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మహేశ్వరరావు సూచించారు. పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థులతో పలురకాల బొమ్మల్ని తయారు చేయించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **డెంకాడ:** ఆర్.ముంగినాపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈవో కె.వెంకటరమణ ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలను అందించేందుకు శిక్షా సప్తాహ్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. ● **గరివిడి:** తొండ్రంగి ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. హెచ్ఎం కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈవో పి.రామారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పిల్లా బంగారులక్ష్మి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **భోగాపురం:** టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తోనే విద్యార్థులకు మెరుగైన బోధన అందించవచ్చని ముక్కాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.నరిశింగరావు అన్నారు. పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపురంలో సమస్యల మోత

● అలంకారప్రాయంగా వాటర్ ట్యాంకు
● వృథాగా పడి ఉన్నపైపులు ● గోతులమయమైన రోడ్డు





నర్సాపురంలో వృథాగా ఉన్న తాగునీటి ట్యాంకు, గుంతలమయంగా ఉన్న రహదారి

రామభద్రపురం: నర్సాపురం గ్రామం సమస్యలకు నిలయం గా మారింది. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ పల్లెలో రక్షిత మంచినీరు అందని ద్రాక్షలానే మిగిలిపో యింది. సుమారు రెండేళ్ల కిందట రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మించారు. పైపులైను వేయకపోవ డంతో గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ కోట వెంకటనాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానానికి వెళ్లే రహదారి పరిస్థితి అధ్వాన్నంగా ఉందని... అక్కడ షెడ్లు, ప్రహరీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని అధికారులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆయన వాపోయాడు. జాతీయ రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులు, గుంతలమయం కావ డంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేకపో వడంతో కాలేజీకి, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిదులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఎంపీడీవో

రాజాం: కలెక్టర్ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులందరికీ ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్విజ్ పోటీల్లో లక్ష్మీపురం విద్యార్థుల ప్రతిభ

రేగిడి: కొమిర గ్రామంలో స్థానిక షిర్డీసాయి ఆలయ నిర్వాహకులు గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో లక్ష్మీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వీరికి రూ.2,500 నగదు బహుమతి అందజేశారు.